మురుగు.. రోడ్లపై పరుగు

పుట్టపర్తి టౌన్: పట్టణంలో మురుగు రోడ్లపై పరుగులు తీస్తోంది. పట్టణంలోని ఎస్‌బీఐ రోడ్డు, సాయిటవర్ ఏరియాలో నాలుగు రోజులుగా అండర్ గ్రౌండ్ మ్యాన్‌హోల్ పొంగి పొర్లుతోంది. దీంతో మురుగునీరు రోడ్డుపై చేరి దుర్వాసన వెదజల్లుతుండటంతో వాహనదారులు, చుట్టుపక్కల నివాసముంటున్న వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రోడ్లపై మురుగు ఉండటంతో దోమలు పెరిగి రోగాలు ప్రబలుతున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




సాయిటవర్ ఏరియాలో మ్యాన్‌హోల్ నుంచి వస్తున్న మురుగునీరు, ఎస్‌బీఐ రోడ్డుపైకి చేరిన మురుగునీరు



గణేష్ సర్కిల్ ఏరియాలో రోడ్డుపై ఇలా..

క్లుప్తంగా

నియోజకవర్గ పరిశీలకుడికి స్వాగతం



నాగభూషణకు స్వాగతం పలుకుతున్న నాయకులు

నల్లచెరువు/ తనకల్లు: కదిరి నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ పరిశీలకుడు కొండవీటి నాగభూషణకు నల్లచెరువు మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి, శ్రేణులు తనకల్లు మండలం చీకటిమానిపల్లి వద్ద గురువారం ఘన స్వాగతం పలికారు. తనకల్లు మండల కన్వీనర్ అశోక వర్ధన్‌రెడ్డి, కదిరి మండల కన్వీనర్ బాబ్జాన్ వైస్ కన్వీనర్ రఫీ, టెంపుల్ మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, సీనియర్ నేతలు వెంకటరెడ్డి, మాజీ సర్పంచులు నరసింహారెడ్డి, రమణారెడ్డి, రైతు విభాగం మండలాధ్యక్షుడు సూర్య శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీపతి, సలీం, ఎంపీటీసీ హిమధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తనకల్లు మండల ఉపాధ్యక్షుడు ముస్తఫా, సర్పంచ్ యూసుఫ్, మైనార్టీ నాయకులు నజీర్, మహమ్మద్ రఫీ, శ్రీకంఠరెడ్డి, మాజీ డైరెక్టర్ గోవిందురెడ్డి యూత్ కన్వీనర్ మన్సూర్ బాషా, నల్లచెరువు గ్రామ కన్వీనర్ సూర్యశేఖర్ రెడ్డి(జేసీబీ) ఉన్నారు.

నేడు మండలంలో 'రచ్చబండ'

గాండ్లపెంట: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణపై శుక్రవారం మండలంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి గురువారం తెలిపారు. ఉదయం9 గంటలకు కమతంపల్లి, 10 గంటలకు కటారుపల్లి, 11 గంటలకు తుమ్మలబైలు, 12 గంటలకు తుమ్మలబైలు తండా, 1 గంటకు గొడ్డువెలగల గ్రామంలో కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వకర్త బీఎస్ మక్బూల్‌తో పాటు పార్టీ పరిశీలకులు పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జన సమర్థ్ పోర్టల్‌పై అవగాహన

గాండ్లపెంట: స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రెడ్డివరప్రసాద్ ఆధ్వర్యంలో జన సమర్థ్ పోర్టల్‌పై క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జన సమర్థ్ పోర్టల్‌లో ప్రధానమంత్రి ముద్ర యోజన, పీవర్స్ యోజన, పీఎంఈజీపీ, సూర్యఘర్ యోజన, పీఎం స్వానిధి రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్లు వీరమారుతి, నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, విశ్రాంత వ్యవసాయశాఖ ఏడీ శ్రీరాములునాయక్, శ్రీనిధి మేనేజర్ ఆనంద్, ఏపీఎం సూర్యనారాయణ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఉర్దూ (ఎకనమిక్స్) విభాగంలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ ఉర్దూ మీడియంలోచదివి, పీజీలో 50 శాతం మార్కులు కలిగి అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 23న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు విద్యార్హత ఒరిజినల్, జిరాక్స్ కాపీలను తీసుకురావాలని తెలిపారు. వేతనం నెలకు రూ.27 వేలు ఉంటుందని, రాష్ట్రంలో ఏ ప్రాంతానికి సంబంధించిన వారైనా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

బాధ్యతలు చేపట్టిన 'సొసైటీ అధ్యక్షుడు'

చెన్నేకొత్తపల్లి: దామాజిపల్లి సహకార పరపతి సంఘం నూతన అధ్యక్షుడిగా నరసింహులు గురువారం బాధ్యతలు చేపట్టారు. చెన్నేకొత్తపల్లిలోని కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సొసైటీ సీఈఓ నరసారాం నూతన అధ్యక్షుడితో పాటు డైరెక్టర్లు నేలకోటప్ప, రామస్వామి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ... సొసైటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఎల్.నారాయణచౌదరితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమీక్ష



మాట్లాడుతున్న డీపీఓ సమత

ఎన్పీకుంట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం డీపీఓ సమత పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవీఆర్ఎస్, స్వామిత్వ సర్వే, స్వర్ణపంచాయితీ కార్యక్రమాల పురోగతిపై ఆరా తీశారు. గ్రామస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగేలా ప్రతి కార్యదర్శి శ్రద్ధ వహించాలన్నారు. ఎంపీడీఓ పార్థసారథి, డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



కుటాగుళ్లలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం

కదిరి టౌన్/ తనకల్లు/ ఎన్పీకుంట/ గాండ్లపెంట/ తలుపుల/ ముదిగుబ్బ: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం వైద్య సిబ్బందిని ఆదేశించారు. కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, తనకల్లు, ఎన్పీకుంట, గాండ్లపెంట, తలుపుల, ముదిగుబ్బ మండలంలోని మలకవేముల పీహెచ్‌సీని తనిఖీ చేశారు. కుటాగుళ్ల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో అందుతున్న మాతా శిశు సంరక్షణ సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆమె సిబ్బందితో మాట్లాడారు. మాతా శిశు సంరక్షణ సేవల్లో ఏ ఒక్కరూ నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనకల్లులో ఆటోలో ప్రసవించి శిశువును కోల్పోయిన గేమేనాయక్‌తండాకు చెందిన బాలింత శారదను పరామర్శించారు. ఆయా కేంద్రాల్లో చికిత్స పొందుతున్న రోగులతో వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పార్టీ బలోపేతానికి కలసికట్టుగా పనిచేద్దాం



ప్రణీత్‌రెడ్డి, వెంకటరామిరెడ్డిని సత్కరిస్తున్న నేతలు

తనకల్లు: పార్టీ బలోపేతం కోసం కలసికట్టుగా పని చేద్దామని వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకులు కేవీ ప్రణీత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సీనియర్ నాయకులు దేశాయి సంజీవరెడ్డి స్వగృహంలో గురువారం మండల పరిశీలకులు ప్రణీత్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెంకటరామిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు విజయలక్ష్మీ, సర్పంచ్ నాగేంద్ర, ఎంపీటీసీలు నాయకులు భక్తవత్సలరెడ్డి, బీఎస్ కలాం, ఎంపీటీసీ హిమధర్‌రెడ్డి, రమణ, హేమశేఖర్‌రెడ్డి, అగ్రీ బోర్డు మాజీ అధ్యక్షుడు కొండా మల్లికార్జున, మాజీ సర్పంచ్ శంకర్,మండల కమిటీ సభ్యులు ముస్తఫా, సూరి, రమణారెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, బయారెడ్డి, సమరసింహారెడ్డి, నర్సీరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, షాన్‌వాజ్, అబ్దుల్, అమీర్, తాహీర్, ఇక్బాల్, విశ్వనాథ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, నరసింహులు, కుమార్, నిజాం, ప్రకాష్, షణ్ముకరెడ్డి, యశ్వంత్‌రెడ్డి, తులసమ్మ, పర్వీన్, గంగాద్రి, లోకేష్‌రెడ్డి, రాజశేఖర్, మాధవరెడ్డి, విద్యాసాగర్, విజయకుమార్, లక్ష్మీపతి, శంకర్, రమణ, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

కనగానపల్లి: ఆకస్మికంగా గుండెపోటు వచ్చినపుడు చేసే సీపీఆర్ (హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనం) విధానంపై ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. గురువారం కనగానపల్లి పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో వేపకుంట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గుండెపోటు వచ్చిన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చికిత్స విధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, పలువురు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తచెరువులో చోరీ

కొత్తచెరువు: మండల కేంద్రంలోని పూజారి కాలనీలో చోరీ జరిగింది. కాలనీకి చెందిన రిటైర్డ్ టీచర్ కాంతమ్మ దంపతులు రెండు రోజుల క్రితం వేరు ఊరికి వెళ్లారు. దుండగులు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న ఒక బంగారు ఉంగరం, బ్రాస్‌లెట్ మొత్తం 25 గ్రాముల బంగారు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హుండీ చోరీ

ముదిగుబ్బ: మంగళమడక ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం రాత్రి హుండీని దుండగులు ఎత్తుకెళ్లారు. చోరీ విషయమై పట్నం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

యువతి అదృశ్యం

కదిరి టౌన్: పట్టణంలోని అడపాలవీధి ఆర్టీసీ బస్టాండ్ వెనుక నివాసం ఉంటున్న పసుపులేటి భాగ్యమ్మ కుమార్తె అదృశ్యమైంది. ఈనెల 11వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ప్రయోజనం లేకపోయింది. యువతి తల్లి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

కదిరిఅర్బన్: కుమ్మరవాండ్లపల్లికి చెందిన ఓ యువతి అదృశ్యమైంది. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి గాలింపు చేపట్టినట్లు కదిరి రూరల్ అప్‌గ్రేడ్ ఏఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వేరుశనగలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంటగా మండలంలో సాగు చేసిన వేరుశనగ పంటలో అధికారులు పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. గురువారం అప్పరాచెరువు గ్రామంలో సర్వే నంబర్ 239-బిలో కె.నరసింహులు పొలంలో పంట కోత చేపట్టగా 2.630 కిలోల దిగుబడి వచ్చిందని ఏఎస్ఓ డాక్టర్ కెఎస్ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డికి ఘన సన్మానం



కేతిరెడ్డిని సన్మానిస్తున్న గోరకాటి పురుషోత్తంరెడ్డి

ధర్మవరం: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నివాసంలో గురువారం ఆయన్ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన గోరకాటి పురుషోత్తంరెడ్డి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కోటిరెడ్డి బాలిరెడ్డి, నాయకులు మాసపల్లి సాయికుమార్, చాంద్‌బాషా, చందమూరు నారాయణరెడ్డి, బడన్నపల్లి కేశవరెడ్డి, చిగిచెర్ల ప్రభాకర్‌రెడ్డి, గరుడంపల్లి రామయ్య, పెనుజూరు నాగరాజు, గజ్జల శివ, భూశెట్టి రామకృష్ణ, బొమ్మన్న, 24వవార్డు శివారెడ్డి, సుధీర్, మంజునాథ్‌రెడ్డి, మల్లేష్, బాబు, ప్రవీణ్, చిన్నూరు నాగరాజు, చింత భాస్కర్‌రెడ్డి, రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, షారుఖ్, ఇర్ఫాన్, షబ్బీర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు

- కదిరి సమన్వయకర్త బీఎస్ మక్బూల్



పెద్దన్నవారిపల్లి సమావేశంలో పాల్గొన్న మక్బూల్ అహ్మద్, నాయకులు

తలుపుల : పేద విద్యార్థులకు వైద్య విద్య, పేదలకు ఉచిత వైద్యం అందించాలని, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కన్వీనర్ పయాజ్ అహమ్మద్ అధ్యక్షతన పెద్దన్నవారిపల్లి, గుండువారిపల్లి, వేపమానిపేట, బండ్లపల్లి, నూతనకాల్వ గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. పెద్దన్నవారిపల్లిలో జరిగిన కార్యక్రమానికి మక్బూల్‌తోపాటు పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కొండవీటి నాగభూషణం, మండల పరిశీలకులు మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పేద విద్యార్థులు ఉచితంగా వైద్య విద్య, సామాన్యులకు ఉచిత వైద్యం అందించేందుకు రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణాలను ప్రారంభించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తున్నారన్నారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరించి గవర్నర్‌కు అందజేస్తామని తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో మద్యం కల్తీ ద్వారా కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. మండల ఉపాధ్యక్షులు జయరాం, మధుసూదన్‌రెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జ్ డీకే బాబు, ఐటీ వింగ్ రాష్ట్ర కార్యదర్శి పూల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాజీ సర్పంచ్‌లు సూర్యనారాయణరెడ్డి, కుర్లి శివారెడ్డి, గామాల పరిశీలకులు రాంప్రసాద్‌రెడ్డి, కృష్ణానాయక్, సర్పంచ్‌లు మనోహర్‌నాయుడు, మల్లినాయుడు, కొండారెడ్డి, షేక్షావలి, ఎంపీటీసీ రాధమ్మ, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, ఉత్తారెడ్డి, సంతోష్‌కుమార్‌రెడ్డి మర్రి రామయ్య, ఓబులరెడ్డి, మౌలా, గౌస్‌మోదీన్, తనకల్లు,నల్లచెరువు మండల కన్వీనర్లు అశోక్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, టెంపుల్ మాజీ చైర్మన్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం రూరల్: బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ సూచించారు. గొట్లూరు గ్రామంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు సౌజన్యంతో జన సురక్ష కార్యక్రమంలో భాగంగా సంతృప్తిస్థాయిలో ఆర్థిక సమ్మిళితం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఆర్‌బీఐ జీఎం, యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్ రాము, సెంట్రల్‌బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ వేణుగోపాల్, ధర్మవరం సెంట్రల్ బ్యాంకు స్రవంతి, లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ రమణ, బ్రాంచ్ మేనేజర్ విష్ణు హాజరై కేంద్ర ప్రభుత్వ పథకాలు, బీమా తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

మెరుగైన సేవలు అందించేందుకు కృషి



ఆసుపత్రి అభివృద్ధిపై చర్చిస్తున్న కమిటీ సభ్యులు

ధర్మవరం: ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేద్దామని ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ వై సోనియా, నరసింహులు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం కమిటీ సభ్యులు పరిశీలించారు. ఓపీ గదులతోపాటు మందులు అందించే గదులు, ఆస్పత్రిలో అందుతున్న సేవలు, సౌకర్యాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమావేశమై సీఎస్ఆర్ ఫండ్స్‌తోపాటు పలు అంశాలపై చర్చించారు. ఆసుపత్రి ఏఓ ఉదయ్ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ నాగార్జున, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: కుటాలపల్లికి చెందిన ఆసం నరసింహారెడ్డి (65) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గురువారం ఉదయం గ్రామానికి వెళ్లి నరసింహారెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, బీసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పారకల రమణ, ఎంపీటీసీ శివారెడ్డి, నాయకులు ఏ.మాధవరెడ్డి, చంద్రహాసరెడ్డి, చెర్లో మాధవరెడ్డి, బాసం కేశవరెడ్డి, హనుమంతరెడ్డి తదితరులున్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

ధర్మవరం రూరల్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు గోపాల్ నాయక్, రాజేశ్వరి గురువారం తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటీలను నిర్వహిస్తామన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

తనకల్లు: దోమలను నివారణతో వ్యాధులను దూరం చేయవచ్చని కదిరి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రామాంజినేయులు అన్నారు. కొర్తికోట పంచాయతీలో గురువారం దోమల నివారణపై అవగాహన కల్పించారు.

నేడు చెన్నేకొత్తపల్లిలో కోటి సంతకాల సేకరణ

చెన్నేకొత్తపల్లి: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలు శుక్రవారం స్థానిక సీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి రాప్తాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

బత్తలపల్లి: బత్తలపల్లి సమీపంలో బుధవారం సాయంత్రం ఆటోను లారీ ఢీ కొన్న ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. తాడిమర్రి మండలం పెద్దకోట్లకు చెందిన గోగుల పెద్దన్న(77) బత్తలపల్లిలోని వడ్డెర కాలనీలో నివాసముంటూ బేల్దారి పనులకు వెళ్లేవాడు. అందులో భాగంగా బుధవారం కాలనీలో మరికొందరు బేల్దార్లతో కలిసి ధర్మవరం మండలం గొట్లూరుకు పనులకు వెళ్లాడు. ఆటోలో తిరిగి వస్తుండగా బత్తలపల్లి సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ఘటనలో పెద్దన్నతోపాటు బేల్దార్లు హనుమంతు, రామాంజనేయులు, అరుణ్‌కుమార్, వెంకటరాముడు, ఓబిలేసు, రమాదేవి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. వీరిలో పెద్దన్న పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతునికి భార్య రామాంజినమ్మతో పాటు నలుగురు కుమారులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన పోషణ్ మహా వేడుకలు

పుట్టపర్తి అర్బన్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన పోషణ్ మహా వేడుకలు గురువారం ముగిశాయి. బ్రాహ్మణపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత పౌష్టికాహార ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లు అందజేశారు. కార్యకర్తలు ఉమా మహేశ్వరి, ఇందులత, అనిత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కదిరిగేటు సమీపంలో ఆర్అండ్‌బీ పనులు ఉండటంతో శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జునేద్ గురువారం తెలిపారు. శాంతినగర్, శారదానగర్, చంద్రబాబునగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

కదిరి అర్బన్: రాచువారిపల్లితండాలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని గురువారం విద్యుత్ రూరల్ ఏఈ శ్రీనివాసులునాయక్‌కు గ్రామ సర్పంచ్ చలపతినాయక్‌తో పాటు పలువురు గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. గురువారం ఏఈ పట్నం పంచాయతీలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా రాచువారిపల్లితండాలో విద్యుత్ సమస్యలను తండావాసులు ఏఈ దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పట్నం వద్ద పాత విద్యుత్ స్తంభాలకు విద్యుత్ సరఫరా అవుతోందని గ్రామస్తులు ఏఈకి ఫిర్యాదు చేశారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ

ధర్మవరం అర్బన్: పట్టణంలో గురువారం కాలేజీ సర్కిల్ నుంచి ఎరగుంట సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆర్టీఓ రాణి, పుట్టపర్తి ఇన్‌కమ్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ చందు మాట్లాడుతూ రవాణా రంగం, వాణిజ్య పన్నుల విభాగంలో ప్రభుత్వం జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించిందన్నారు. ర్యాలీలో పట్టణంలోని వాహన షోరూంల నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

తనకల్లు: చీకటిమానిపల్లి ఈదులవంక వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.....కొక్కంటిక్రాస్ చంద్రబాబు కాలనీకి చెందిన సురేష్ అన్నమయ్య జిల్లా మొలకలచెరువులో పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. చీకటిమానిపల్లి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీ కొంది. ప్రమాదంలో సురేష్ బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. సమాచారం అందుకున్న స్థానికులు క్షతగాత్రున్ని 108 వాహనంలో తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేటలోని ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న ఏడుగురు పేకాటరాయుళ్లను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.43,120 నగదు, రెండు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలుస్వాధీనం చేసుకున్నామని టూ టౌన్ పోలీసులు తెలిపారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

ముదిగుబ్బ: మండల కేంద్రంలో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని మహిళలు గురువారం తహసీల్దార్ నారాయణస్వామికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతు పాత డ్రైనేజీ ఆక్రమణలకు గురికావవడంతో వర్షాలు కురిసినప్పుడు మురుగునీరు వీధుల్లోకి చేరి అపరిశుభ్రంగా ఉంటోందన్నారు.

మొక్కల పెంపకం చేపట్టాలి

ఓడీచెరువు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకం చేపట్టాలని తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గ్రీన్ సత్యసాయి కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో తహసీల్దార్, ఎంపీడీఓ శివరాంప్రసాద్ రెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మొక్కలు నాటారు. ఓడీచెరువు పంచాయతీ కార్యదర్శి శంకర్, ఉపాధి హామీ, సచివాలయ, వైద్య,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

లాంగుబాటు వైఖరి విడనాడాలి

ఓడీచెరువు: ట్రంప్ ఆధిపత్య ధోరణికి అడుగులు మడుగులొత్తే లొంగుబాటు వైఖరిని కేంద్ర ప్రభుత్వం విడనాడాలని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రధాని మోదీ విదేశాంగ విధానంపై కరపత్రాలు పంపిణీ చేశారు. సీపీఎం నేత వీవీ రమణ, మండల కార్యదర్శి కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు

ముగ్గురిపై కేసు నమోదు

కదిరి టౌన్: అక్రమంగా స్థలంలోకి ప్రవేశించి ఇంటి సన్‌షేడ్‌ను పగులగొట్టిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని జడ్జి క్వార్టర్స్ పక్కన నివాసం ఉంటున్న లలితమ్మకు పక్కన నివాసం ఉన్న ఖాదర్‌ఖాన్‌కు గత కొన్ని రోజులుగా స్థల వివాదం ఉంది. ఈక్రమంలో బుధవారం రాత్రి ఖాదర్‌ఖాన్, అతని భార్య, కుమారుడు జేసీబీతో స్థలంలోకి ప్రవేశించి లలితమ్మ ఇంటి సన్‌షేడ్‌ను ధ్వంసం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కదిరి అర్బన్: కారెడ్డిపల్లి వద్ద ఈ నెల 15న మొక్కజొన్న నూర్పిడి యంత్రం వద్ద ప్రమాదవశాత్తు గాయపడిన అయ్యన్నగారి కొత్తపల్లికి చెందిన లక్ష్మీదేవి(47)చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మొక్కజొన్న నూర్పిడి చేసే యంత్రం వద్ద ప్రమాదవశాత్తు ఆమె తల, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

26న మెగా వైద్యశిబిరం

ధర్మవరం అర్బన్: ఈనెల 26న కొత్తపేట ఉషోదయ పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి మోహన్ తెలిపారు.

ఆకట్టుకున్న సత్యసాయి నగర సంకీర్తన



సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

చెన్నేకొత్తపల్లి: సత్యసాయి శత జయంత్యుత్సవం నేపథ్యంలో గురువారం చెన్నేకొత్తపల్లిలో భక్తులు నగర సంకీర్తన చేశారు. తొలుత సత్యసాయి చిత్ర పటాన్ని పల్లకీలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. సత్యసాయి బాబా భజన మండలి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, చెన్నేకొత్తపల్లి మండల కన్వీనర్ పెద్దన్న, మహిళా సేవాదళ్ జిల్లా జాయింట్ కోఆర్డినేటర్ పద్మావతితో పాటు సాయిభక్తులు పాల్గొన్నారు.